క్లుప్తంగా

గోదాంను పరిశీలించి మార్కెట్ కమిటీ చైర్మన్



వివరాలు తెలుసుకుంటున్న చైర్మన్ దేవయ్య

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ గోదాంను సోమవారం కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా గోదాం కెపాసిటీ, నిల్వ ఉంటున్న సామగ్రిలతో పాటు సివిల్ సప్లై గోదాం కొనసాగుతుండగా.. పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సమీర్, శంకర్, కాంగ్రెస్ నాయకులు చౌదరి తిరుపతి, మహేశ్, నానాజీ, ఇప్ప రవి శంకర్, దుర్గం రత్నాకర్ పాల్గొన్నారు.

బండలు కొట్టేందుకు అనుమతి ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న వడ్డెరులు

కెరమెరి: వడ్డెరులకు క్వారీల్లో బండలు కొట్టేందుకు అనుమతి ఇవ్వాలని వడ్డెర సంఘం నాయకులు కాంగ్రెస్ ఆసిఫాబాద్ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్‌ను కోరారు. సోమవారం మండల కేంద్రానికి వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఫారెస్టు అధికారులు బండలు కొట్టేందుకు అనుమతులు లేవని అడ్డుకుంటున్నారని వాపోయారు. దీంతో ఇతర పనులు చేయలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్పించి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, మండలాధ్యక్షుడు కుసుంబ్‌రావు, రజాక్, కుత్‌బోద్దిన్, సుదర్శన్, బాబునాయక్ పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

రెబ్బెన: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్ కేజీబీవీలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసమే షీ టీం పని చేస్తోందన్నారు. హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంకు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. ఆపద సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు డబ్ల్యూహెచ్‌సీ సునీత, శ్రీలత పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో రవిదాస్

వాంకిడి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సోమవారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, అంగన్‌వాడీ టీచర్ రాజ్‌కుమారి, ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాజేశ్వర్

కెరమెరి: ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కుమురం భీం పోరు గ్రామాల అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం జోడేఘాట్‌లోని కుమురం భీం స్మృతివనంలో ఆదివాసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీఏటా ఆదివాసీల దినోత్సవం జరుపుకుంటున్న ఆదివాసీల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. కార్యక్రమంలో కుమురం కిరణ్, టేకం పరుషురాం, గజానంద్, జంగు, సంతోష్, ధర్ము, నాందేవ్, మారుతి, జలపతి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



కెరమెరి: ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ సీఈవో



సిర్పూర్(టి): మొక్క నాటుతున్న ఎంపీడీవో



రెబ్బెన: వంకులంలో..

ఊరూరా స్వచ్ఛదనం.. పచ్చదనం

జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం అధికారులు, విద్యార్థులు ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పలు గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కెరమెరి మండలంలోని రింగన్‌ఘాట్, కొఠారి గ్రామాల్లో జెడ్పీ సీఈవో లక్ష్మినారాయణ మొక్కలు నాటారు. - సాక్షి, నెట్‌వర్క్



లింగాపూర్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



రెబ్బెన: మొక్క నాటుతున్న తహసీల్దార్



కౌటాల: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



బెజ్జూర్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చింతలమానెపల్లి: మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, వైద్య సిబ్బంది

భక్తిశ్రద్ధలతో శ్రావణ సోమవారం



పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: శ్రావణ సోమవారం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. పట్టణంలోని బాలేశ్వర స్వామి, శివకేశవ మందిర్‌తో పాటు పలు ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల సందడిగా నెలకొంది. అర్చకులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు శ్రావణ సోమవార పూజలు చేశారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలోని రంగనాయక, శివాలయం, వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో భక్తుల కనిపించింది.

మహిళలు రాణించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న జంగుబాయి

జైనూర్: మహిళలు ఆర్థికంగా రాణించేందుకు స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలని రాణి దుర్గావతి ట్రస్ట్ చైర్మన్ గోడం జంగుబాయి అన్నారు. సోమవారం రాణి దుర్గావతి ట్రస్టు ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాంబాయి, గంగామణి, అనూసయబాయి పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా గుండాల

- పర్యాటకులను ఆకర్షిస్తున్న జలపాతం
- సరైన రోడ్డు లేక కుంటుపడుతున్న అభివృద్ధి
- సమస్యలతో సతమతమవుతున్న గ్రామస్తులు



కాలినడకన వెళ్తున్న గుండాల గ్రామస్తులు

తిర్యాణి: అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని ఉన్నట్లు మారింది మండలంలోని గుండాల గ్రామస్తులు పరిస్థితి. చుట్టూ పచ్చని అడవిలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న గుండాల గ్రామంలో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇటు ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గుండాల గ్రామపంచాయతీ పరిధిలో ఏడు గూడెలు ఉండగా.. 1000కి పైగా జనాభా నివాసిస్తున్నారు.

అందమైన జలపాతం..

గుండాల గ్రామంలో నేలంతా రాతిమయంగా ఉండటంతో వ్యవసాయనికి ఏ మాత్రం అనువుగా ఉండదు. అటువంటి నేలపై బొజ్జు అనే యువకుడి ఆలోచనతో రాతినేలపై చెరువు మట్టి పోసి ఎటువంటి రసాయనిక ఎరువులను వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తూ.. అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. దీనికి తోడు గ్రామ శివారులోని దట్టమైన అడవిలో అందమైన గుండాల (బహుబలి) జలపాతం ఉంది. వంద అడుగుల ఎత్తు నుంచి నీళ్లు కిందికి జాలువారుతూ ఉండే జలపాతాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. అయితే గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం నేటికి ప్రభుత్వాలు కల్పించకపోవడంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. కాలేమేదైనా కాలినడకనే దిక్కు.

రోడ్డు నిర్మాణమే ఏకైక పరిష్కారం..

జలపాతంతో పాటు సేంద్రియ పద్ధతులల్లో గుండాల గ్రామస్తులు పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉండడంతో పాటు సహజ సిద్ధంగా సేకరించే తేనే, మొర్రిపండ్లు విక్రయించాలన్నా.. రోడ్డు మార్గం లేక సరైన ఆదాయం పొందలేకపోతున్నారు. రోడ్డు సమస్యే అభివృద్ధికి నిరోధకంగా మారింది. రోంపెల్లి నుంచి గుండాల వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన క్షేత్రస్థాయిలో అటవీశాఖ అనుమతులు లేక పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుండాల గ్రామానికి రోడ్డు నిర్మించి, ఇతర వసతులు నిర్మించాలని ఆదివాసీ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



రోంపెల్లి నుంచి గుండాల వరకు రోడ్డు నిర్మాణం మంజూరైంది. ఫారెస్టు క్లియరెన్స్ రావడం లేదని అధికారులు చెబుతున్నారు. రేషన్, పింఛన్, ఉన్నత విద్య, వైద్యం లాంటి ప్రతీ అవసరాలకు కాలినడకనే వెళ్తున్నాం. దీంతో అత్యవసర సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు నిర్మించాలి.

– శంకర్, గుండాల

అభివృద్ధికి అవకాశం



మా గ్రామానికి రోడ్డు నిర్మాణం పూర్తయితే పర్యటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది. గ్రామంలోని చదువుకున్న నిరుద్యోగులకు జలపాతం వద్ద ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అంతేకాక తాము సేంద్రియ పద్ధతులల్లో పండించిన పంటలను మార్కెట్‌కు తరలించే అవకాశం ఉంటుంది.

– మర్సుకోల అశోక్, గుండాల

జూనియర్ కాలేజీలపై ప్రత్యేక దృష్టి



ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ప్రత్యేక యాప్ రూపకల్పనకు ఇంటర్ బోర్డు సన్నాహాలు
- మెరుగుపడనున్న విద్యాబోధన

ఆసిఫాబాద్‌అర్బన్: రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొనేందుకు ప్రభుత్వం నూతన పద్ధతులను అవలంభిస్తుంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది పనితీరు, వివిధ కార్యక్రమాల నిరంతర పర్యవేక్షణకు ఇంటర్ బోర్డు సిద్ధమౌతోంది. ఇందుకోసం ప్రత్యేక యాప్ రూపకల్పనకు సన్నాహాలు చేస్తోంది. యాప్‌పై కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు గతంలోనే అధికారులు జూమ్ యాప్ వేదికంగా అవగాహన కల్పించి వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.

విద్యాబోధన, పనితీరు మెరుగయ్యేందుకు..

జూనియర్ కళాశాలల్లో విద్యా, ఇతర విషయాలపై ఆయా కళాశాలల ప్రధానాచార్యులు నివేదిక తయారు చేసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీన్ని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి (డీఐఈవో) పరిశీలించి రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారికి పంపిస్తారు. ఆయా కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరు, తరగతులు, లఘు, ఇతర పరీక్షల నిర్వహణ, వాటి ఫలితాలు, సిలబస్ ప్రకారం పాఠ్యాంశాల బోధన తీరు. చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ విషయాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఆయా కార్యక్రమాల పనితీరును నమోదు చేయాలి. డీఐఈవో కళాశాలలను తరచుగా తనిఖీ చేస్తుండాలి. యాప్‌తో ప్రతిఒక్కరి పనితీరుని మరింత మెరుగుపడనుందని భావిస్తున్నారు.

విధివిధానాలు రావాల్సి ఉంది



జూనియర్ కళాశాలలపై పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వ యాప్ అందుబాటులోకి వస్తే ఇంటర్ విద్య మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంది. కళాశాలల్లో సౌకర్యాలు, విద్యాబోధన మెరుగుపడుతుంది. నూతన యాప్‌పై గత నెలలో జూమ్ యాప్ ద్వారా అవగాహన కల్పించారు. ఇంకా విధివిధానాలు ప్రకటించాల్సి ఉంది.

– బి. రాందాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్

ఎస్సీ వర్గీకరణ పునః పరిశీలించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌటాల: సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను పునః పరిశీలించాలని దళిత బహుజన సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగబద్ధంగా లేదన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం దళితులను విడదీసి, లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ పుష్పాలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం ప్రవీణ్, జుమ్మీ సాగర్, సంతోష్, కోసన్‌కార్ అనిల్, సంజీవ్, నాందేవ్, వంశీ, శంకర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ.. ర్యాలీ

సిర్పూర్(టి): ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ.. సోమవారం మండలంలోని మాల, మన్నెపు సంఘాల నాయకులు అంబేద్కర్ భవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో మాల, మన్నెపు సంఘాల నాయకులు నగ్రాడె రాజు, దుర్గం విక్రమ్, దుర్గం తులసీరాం, నామ్‌దేవ్, దుర్గం ప్రశాంత్, దుర్గం తిరుపతి, దశరథ్, బాస సంతోష్ పాల్గొన్నారు.

ఇంటి ట్యాక్స్ ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వాంకిడి: మండల కేంద్రంలోని లక్ష్మినగర్ కాలనీలో నివాసం ఉంటున్న వారికి ఇంటి ట్యాక్స్ ఇవ్వాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రియాజ్ అలీకి వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వం కల్పించిన ప్లాట్‌లలో 13 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, ఇప్పటి వరకు ఇంటి ట్యాక్స్ ఇచ్చేందుకు అధికారులు ముందుకురావడం లేదన్నారు. ట్యాక్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుని భద్రత కల్పించాలని కోరారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలి



కెరమెరి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కెరమెరి: పుట్టిన బిడ్డలకు తల్లిపాలే తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. మండలంలోని గోయగాం సెక్టార్ పరిధిలోని కెలికే గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు తాగిన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరు మాసాల వరకు తల్లిపాలే తాగించాలన్నారు. కార్యక్రమంలో పోషన్ అభియాన్ డీసీ తౌఫిక్, అంగన్‌వాడీలు మంజల, సేవంతా, చంద్రకళ, కళావతి పాల్గొన్నారు.



రెబ్బెన: గోలేటిలో..

రెబ్బెన: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. సోమవారం మండలంలోని గోలేటిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన గంటలలోపు తల్లిపాలు తాగించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, స్వర్ణలత, మంజుల, బాలమ్మ, సాంబలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పీడీఎస్ బియ్యం పట్టివేత

పెంచికల్‌పేట్: మండలంలోని కొండెపల్లి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం పక్కా సమాచారంతో కొండెపెల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్ ఇంటి వద్ద నిల్వ ఉంచిన ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. పెంచికల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు.

హక్కులపై అవగాహన ఉండాలి

బెజ్జూర్: విద్యార్థి దశ నుంచే హక్కులపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మానవ హక్కుల కౌన్సిల్ ట్రెజర్ సభ్యురాలు మమత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో రాష్ట్ర మానవ హక్కుల కౌన్సిల్ ట్రెజర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల హక్కులు, బాలల భద్రత, పోక్సో తదితర చట్టాల గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు.

'మాఫీ' కోసం పడిగాపులు

బెజ్జూర్: రుణమాఫీ కోసం రైతులు పడిగాపులు తప్పడం లేదు. బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార బ్యాంక్ ఎదుట సోమవారం గంటల తరబడి నిరీక్షించారు. సహకార సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రుణమాఫీ నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాఠశాల ఆవరణలో పాము కలకలం



పాఠశాలలోకి వచ్చిన పాము

కెరమెరి: మండలంలోని భీమన్‌గోంది ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం పాము కలకలం రేపింది. ఉదయం విద్యార్థులు బడికి హాజరు కాగా పక్కనున్న పొలం నుంచి పాము వచ్చింది. గమనించిన గ్రామస్తులు పామును కొట్టి చంపారు. అయితే పాఠశాల చుట్టూ పంట పొలాలు ఉండడంతో ఏ క్షణంలో విషసర్పాలు వస్తాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.